

## డుకాటీ నుంచి 8 నయా బైకులు

న్యూఢిల్లీ, జనవరి 2: ఇటలీకి చెందిన లగ్జరీ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ డుకాటీ..నూతన సంవత్సరానికిగాను నయా ప్లాన్‌ను ప్రకటించింది. ఈ ఏడాది దేశీయ మార్కెట్లోకి 8 నూతన బైకులను విడుదల చేయనున్నట్లు తెలిపింది. వీటిలో మల్టీస్ట్రాడా వీ4 ఆర్ఎస్, డిసర్ట్ ఎక్స్ ర్యాలీ, పనిగేల్ వీ4 రేసింగ్ రెప్లికా 2023, డయావెల్(బెంట్లీ), మాన్‌స్టార్ 30, పనిగల్ వీ4 ఎస్‌పీ2 30తో పాటు స్ట్రీట్‌ఫైటర్ వీ4 ఎస్ 2023 మాడల్ కూడా ఉన్నట్లు పేర్కొంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో రెండు మాడళ్లను అందుబాటులోకి తీసుకురానున్న సంస్థ.. రెండో త్రైమాసికంలో మరో రెండు, నాలుగో త్రైమాసికంలో ప్రత్యేక మాడళ్లను పరిచయం చేయబోతున్నది.

## బీవోఐ డిపాజిట్లపై 7.50 శాతం వడ్డీ

ముంబై, జనవరి 2: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ప్రత్యేక డిపాజిట్ స్కీంను ప్రకటించింది. 175 రోజుల కాలపరిమితితో సూపర్ స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 7.50 శాతం వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్నది. రూ.2 కోట్ల నుంచి రూ.50 కోట్ల లోపు డిపాజిట్లపై ఈ వడ్డీ వర్తించనున్నదని పేర్కొంది. స్వల్పకాలిక డిపాజిట్ చేయాలనుకునే ప్రవాస భారతీయులు, వ్యాపారవేత్తలకు ఈ స్కీం ఉపయోగకరంగా ఉంటుందని బ్యాం కింగ్ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 1 నుంచి అమలులోకి వచ్చే ఈ స్కీం స్వల్ప కాలం మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపాయి.

# గోల్డ్ @ 70,000!

### ఈ ఏడాది తులం బంగారం ధరపై జీజేసీ అంచనా

ముంబై, జనవరి 2: దేశీయ మార్కెట్‌లో తులం బంగారం ధర ఈ ఏడాది దాదాపు రూ.70,000 దరిదాపుల్లోకి వెళ్లవచ్చని అఖిల భారత రత్నాలు, ఆభరణాల మండలి (జీజేసీ) మంగళవారం అంచనా వేసింది. గత ఏడాది మునుపెన్నడూ లేనివిధంగా 10 గ్రాముల మేలిమి (99.9 స్వచ్ఛత) బంగారం రేటు సరికొత్త ఆల్‌టైమ్ హై రికార్డును సృష్టిస్తూ రూ.64,460గా నమోదైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఏడాది మరో రూ.5,000 నుంచి 6,000 వరకు పెరుగవచ్చన్న అభిప్రాయాన్ని జీజేసీ వ్యక్తం చేసింది.



**ఇదీ సంగతి..**

బంగారం ధరలు పెరుగుతాయన్న అంచనాల వెనుక అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, భౌగోళిక రాజకీయ ఆందోళనలు ప్రధానంగా ఉన్నాయని జీజేసీ అంటున్నది. స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న నేపథ్యంలో మదుపరులు తమ పెట్టుబడులకు సురక్షిత సాధనంగా పసిడినే ఎంచుకుంటుండటం, ద్రవ్యోల్బణం సవాళ్లను అధిగమించేందుకున్న అత్యుత్తమ మార్గం సైతం పుత్తడేనని మెజారిటీ ఇన్వెస్టర్లు భావిస్తుండటం కూడా రేట్లు ఎగబాకేందుకు దోహదం చేస్తున్నదని చెప్తున్నది.

**గ్లోబల్ మార్కెట్‌లో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ విలువ ఈ ఏడాది 2,300 డాలర్లకు చేరవచ్చని జీజేసీ అంచనా వేస్తున్నది. ఇదే జరిగితే భారతీయ మార్కెట్‌లో 10 గ్రాములు గరిష్ఠంగా రూ.70,000 తాకుతుందని అంటున్నది. 2023లో గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు గోల్డ్ 2,081 డాలర్లు పలికింది. 'ఆర్థిక పరిస్థితులు ఇంకా దిగజారితే బంగారం తదితర రక్షణాత్మక ఆస్తులకు డిమాండ్ పెరుగుతుంది. దీంతో వాటి విలువ అమాంతం ఎగిసిపడవచ్చు. ఫలితంగా అన్ని పాత అంచనాల్ని మించి మార్కెట్ దూసుకుపోగలదు' అని జీజేసీ చైర్మన్ సైయం మెహ్రా ఓ ప్రకటనలో విశ్లేషించారు. ఈ క్రమంలోనే భౌతిక బంగారంతోపాటు గోల్డ్ బాండ్లు, కడ్డీలు, నాణేలకూ గిరాకీ ఉంటుందంటున్నారు.

**2023లో..**

2023లో బంగారం ధరలు ఆకర్షణీయంగానే పెరిగాయి. తులం రూ.8,000 వరకు ఎగబాకడం గమనార్హం. 2022 ఆఖర్లో 10 గ్రాముల పుత్తడి రూ.57,000 దరిదాపుల్లోనే ఉన్నది. 2023 చివర్లో ఇది సుమారు రూ.65,000 వద్దకు చేరింది. దీంతో రూ.8,000 వృద్ధి కనిపించగా, బంగారంపై పెట్టుబడులు పెట్టిన మదుపరులకు ఏకంగా 13 శాతం లాభాలు దక్కాయి. ఈ ఏడాదీ మార్కెట్ తీరు ఇలాగే ఉంటుందన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. ఇప్పటికే కొత్త సంవత్సరం వేళ టిప్స్ ఇస్తున్న ఆర్థిక నిపుణులు.. బంగారంపై పెట్టుబడుల కోసం మదుపరులు తమ పోర్ట్‌ఫోలియోల్లో 10-15 శాతం వరకు కేటాయించుకోవచ్చని సూచిస్తున్న విషయం తెలిసిందే.



**అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపునకు విరామం ఇస్తుందన్న అంచనాలు, అధిక ద్రవ్యోల్బణం వంటివి మదుపరులను బంగారం వైపు చూసేలా చేస్తున్నాయి. గత ఏడాది ఏవిధంగానైతే ఇన్వెస్టర్లను పసిడి ఆకట్టుకున్నదో.. ఈ ఏడాదీ అదే రీతిలో ఆకర్షించే వీలున్నది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-గాజా దాడుల ప్రభావం కూడా మార్కెట్‌పై ఉంటుంది. ఈక్విటీ మార్కెట్ల ఒడిదుడుకుల మధ్య సహజంగానే మదుపరులు బంగారం వైపునకు వెళ్తారు. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో ధరలు మరింత పెరుగుతాయి.**

**-సైయం మెహ్రా, జీజేసీ చైర్మన్**




## ముడి చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంపు

ముంబై, జనవరి 2: దేశంలో ఉత్పత్తయిన ముడి చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను కేంద్ర ప్రభుత్వం పెంచింది. అలాగే డీజిల్, విమాన ఇంధన ఎగుమతులపై సుంకాన్ని జీరో శాతానికి తగ్గించింది. దేశీయంగా ఉత్పత్తయ్యే క్రూడాయిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సయిజు సుంకం రూపంలో విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను టన్నుకు రూ.1,300 నుంచి రూ. 2,300కు పెంచినట్టు మంగళవారం విడుదలైన నోటిఫికేషన్‌లో తెలిపింది. డీజిల్ ఎగుమతులపై ట్యాక్స్‌ను లీటరుకు రూ.0.50 నుంచి నిల్ చేయగా, విమాన ఇంధనంపై రూ.1 నుంచి జీరో చేశారు. కొత్త రేట్లు తక్షణమే అమలులోకి వచ్చాయి. 2022 జూలై 1 నుంచి కేంద్ర ప్రభుత్వం ఇంధన కంపెనీలు ఆర్జించే అధిక లాభాలపై విండ్‌ఫాల్ ట్యాక్స్ విధించడం ప్రారంభించింది. రెండు వారాల ముడి చమురు సగటు ధర ఆధారంగా ప్రతీ పక్షం రోజులకోసారి ఈ పన్ను రేట్లను సవరిస్తున్నది.

## రుణ వితరణలో పీఎన్‌బీ, బీవోఎం టాప్

న్యూఢిల్లీ, జనవరి 2: ప్రభుత్వరంగ బ్యాంకులు రుణ వితరణలో దూసుకుపోతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర(బీవోఎం)లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. డిసెంబర్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో పీఎన్‌బీ రుణ వితరణ ఏడాది ప్రాతిపదికన 13.5 శాతం పెరిగి రూ.9.72 లక్షల కోట్ల రుణాలు మంజూరు చేసింది. ఏడాదిక్రితం ఇచ్చిన రుణాలు రూ.8.56 లక్షల కోట్లుగా ఉన్నాయి. డిపాజిట్లు ఏడాది ప్రాతిపదికన 9.4 శాతం అధికమై రూ.12.10 లక్షల కోట్ల నుంచి రూ.13.23 లక్షల కోట్లకు చేరుకున్నాయి. మరో సంస్థయైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.1.88 లక్షల కోట్ల రుణాలను మంజూరు చేసింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో మంజూరు చేసిన రూ.1.56 లక్షల కోట్ల కంటే ఇది 20.28 శాతం అధికమని పేర్కొంది. అలాగే డిపాజిట్లు రూ.2.08 లక్షల కోట్ల నుంచి రూ.2.45 లక్షల కోట్లకు పెరిగాయి.

## తగ్గిన మారుతి ఉత్పత్తి

న్యూఢిల్లీ, జనవరి 2: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ ఉత్పత్తి మరింత తగ్గింది. డిసెంబర్ నెలలో సంస్థ 1,21,028 యూనిట్ల వాహనాలను ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తి చేసిన 1,24,722 యూనిట్లతో పోలిస్తే 2.96 శాతం తగ్గినట్టు పేర్కొంది. వీటిలో ప్యాసింజర్ వాహనాల ఉత్పత్తి 1,24,135 యూనిట్ల నుంచి 1,19,518 యూనిట్లకు తగ్గాయని తెలిపింది. అలాగే లైట్ కమర్షియల్ వాహనం సూపర్ క్యారీ ప్రొడక్షన్ 587 యూనిట్ల నుంచి 1,510 యూనిట్లకు పెరిగాయి.



# గృహ రుణాలదే హవా

### గత ఏడాది అక్టోబర్ నాటికి మొత్తం రుణాల్లో రూ.21.44 లక్షల కోట్లుగా నమోదు

**ఆ తర్వాత వ్యక్తిగత, వాహన రుణాలు • బ్యాంక్‌బజార్ తాజా నివేదికలో స్పష్టం**

**ఇల్లు కట్టి చూడు.. పెండ్లి చేసి చూడు అన్నారు పెద్దలు.**

**పెండ్లి సంగతి పక్కనబెడితే ఇంటి బరువు, బాధ్యతలు అన్నీఇన్నీ కావని ఆనాడే చెప్పారు.**

**అందుకే గృహ రుణాలకు అంత ప్రాధాన్యత. నాడైనా.. నేడైనా ఈ పరిస్థితిలో మార్పు మాత్రం లేదు. లోన్ మార్కెట్ గణాంకాలే ఇందుకు నిదర్శనం.**

న్యూఢిల్లీ, జనవరి 2: దేశంలో సొంతింటి కల సాకారానికే అత్యధికులు పెద్దపీట వేస్తున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ బిజినెస్ లెక్కల్లో ఇదే తేలింది. దేశవ్యాప్తంగా తీసుకుంటున్న రుణాల్లో గృహ రుణాలదే అగ్రస్థానంగా ఉన్నది మరి. బ్యాంక్‌బజార్ తాజాగా రూపొందించిన మనీమూడ్ రిటైల్ క్రెడిట్ ట్రెండ్స్ నివేదిక ప్రకారం గత ఏడాది అక్టోబర్ నాటికి ఉన్న మొత్తం రుణాల విలువ రూ.45.51 లక్షల కోట్లు. ఇందులో హోమ్ లోన్లే రూ.21.44 లక్షల కోట్లుగా ఉండటం గమనార్హం. ఇది 47.11 శాతానికి సమానం. 2017-18 నుంచి 2021-22 మధ్యలోనే దాదాపు రూ.8 లక్షల కోట్లుగా గృహ రుణాల విలువ ఉండటం విశేషం.

**వడ్డీరేట్లు తగ్గడంతో..**

2020 మొదలు ప్రపంచవ్యాప్తంగా కరోనా ప్రకంపనలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మహమ్మారి భారత్‌సహా యావత్తు ప్రపంచ ఆర్థిక వ్యవస్థనే ప్రభావితం చేసిందన్న సంగతీ విదితమే. మునుపెన్నడూ చూడని, కలలో కూడా ఊహించని లాక్‌డౌన్లతో ప్రపంచ ఎకానమీ స్వరూపమే మారిపోయింది. దీంతో కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లూదేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రుణాలపై వడ్డీరేట్లను తగ్గించడం ఆరంభించింది. వరుస కోతలతో గృహ రుణాలుసహా అన్నీ అందుబాటులోకి వచ్చాయి. రెపోరేటు 4 శాతం దరిదాపుల్లోకి దిగొచ్చి రియల్ ఎస్టేట్‌కు గొప్ప ఉత్సాహాన్నే ఇచ్చింది. అందరూ హోమ్ లోన్లపై ఇండ్లు కొనేసుకున్నారు. ఆ తర్వాత ద్రవ్యోల్బణం విజృంభించడంతో దాన్ని అదుపులోకి తెచ్చేందుకు ఆర్బీఐ కూడా వడ్డింపులు మొదలు పెట్టింది. ఇప్పుడు రెపోరేటు 6.5 శాతానికి చేరినది తెలిసిందే. ఫలితంగా గృహ రుణాల మంజూరులో మునుపటి వేగం కూడా మందగిస్తూ వచ్చింది.


**ఇతర రుణాల్లో..**

గృహ రుణాలు కాకుండా ఇతర రుణాల్లో వ్యక్తిగత రుణాలకు ఎక్కువగా డిమాండ్ కనిపిస్తున్నది. నిరుడు అక్టోబర్ నాటికి ఉన్న మొత్తం రుణాల్లో పర్సనల్ లోన్ల వాటా రూ.12.59 లక్షల కోట్లుగా ఉన్నది. మొత్తం రుణాల్లో ఇది 26.66 శాతం. మిగతా 26.23 శాతంలో వాహన, క్రెడిట్ కార్డ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) తాకట్టుపై తీసుకునే రుణాలు, విద్యా, బంగారం, కన్స్యూమర్ డ్యూరబుల్స్, షేర్లు-బాండ్లు ఇతరత్రా వాటిపై తీసుకునే రుణాలున్నాయి.

**మెడికల్ లోన్లకు డిమాండ్**

మెడికల్ లోన్లకూ డిమాండ్ పెరిగింది. వ్యక్తిగత రుణాల్లో వీటి వాటా ఇటీవలికాలంలో పెరుగుతున్నట్టు తాజా రిపోర్టులో స్పష్టమైంది. భారీగా ఎగిసిన వైద్య ఖర్చులు, చాలామందికి సరిపడా ఆరోగ్య బీమా లేకపోవడం వంటి కారణాల నడుమ మెడికల్ లోన్లకు ప్రాధాన్యత పెరుగుతున్నట్టు బ్యాంక్‌బజార్ చెప్తున్నది.








కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రూ.1,083 కోట్ల డివిడెండ్ చెక్‌ను అందిస్తున్న జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు

## రూపాయి విలవిల

• **మరో 11 పైసల క్షీణత**

ముంబై, జనవరి 2: గతవారం కాస్త బలపడిన రూపాయి మారకపు విలువ ఈ వారం మళ్లీ దిగువబాట పట్టింది. వరుసగా రెండు రోజులూ క్షీణించింది. మంగళవారం ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్చేంజ్ (ఫారెక్స్)లో బలహీనంగా ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 83.35 వరకూ తగ్గింది. చివరకు క్రితం ట్రేడింగ్ రోజుతో పోలిస్తే 11 పైసలు నష్టపోయి 83.32 వద్ద ముగిసింది. సోమవారం ఇది 5 పైసలు తగ్గిన సంగతి తెలిసిందే. దేశీయ స్టాక్ మార్కెట్‌లో నెగెటివ్ ట్రెండ్ నెలకొనడం, దిగుమతిదార్ల నుంచి డాలర్లకు డిమాండ్ ఏర్పడటం రూపాయి తగ్గుదలకు కారణమని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఎర్ర సముద్రంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధర పెరగడం, యూఎస్ డాలర్ బలపడటంతో దేశీయ కరెన్సీ క్షీణించిందని బీఎన్‌పీ పారిబా రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌధరి చెప్పారు. డాలర్ ఇండెక్స్ 0.11 శాతం పెరిగి 101.44 వద్దకు చేరగా, ప్రపంచ మార్కెట్లో బ్యారల్ క్రూడాయిల్ ధర 2.13 శాతం మేర ఎగిసి 78.68 డాలర్ల వద్దకు పెరిగింది.



**83.20-83.50 శ్రేణిలో హెచ్చుతగ్గులు**

అమెరికాలో బుధవారం వెలువడనున్న కీలకమైన తయారీ, సర్వీసుల పీఎంఐ గణాంకాలపై ఫారెక్స్ ట్రేడర్లు దృష్టినిలిపారని, దీంతో రూపాయి ఒడిదుడుకులకు లోనుకావచ్చని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ చెప్పారు. డాలర్-రూపాయి స్పాట్ ధర 83.20-83.50 శ్రేణిలో ట్రేడ్ అవుతుందని అంచనా వేశారు. ఎర్ర సముద్రంలో ఏర్పడిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో డాలరు మారకంలో రూపాయి విలువ 83.10-83.70 శ్రేణిలో కదలవచ్చని అంచనా వేస్తున్నట్టు అనూజ్ చౌధరి చెప్పారు.

## రూ.5.89 కోట్ల జీఎస్టీ ఎగవేత


### ఏఎస్ మెట్ కార్పొరేషన్ సీఈవో పీయూష్ ప్రవీణ్ చంద్ర అరెస్ట్




హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): వస్తు సేవల పన్ను(జీఎస్టీ) ఎగవేసిన ఓ కంపెనీ నిర్వాకాన్ని వాణిజ్య పన్నుల శాఖ బట్టబయలు చేసింది. తప్పుడు వివరాలతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను క్లెయిమ్ సంబంధించి ఏఎస్ మెటో కార్పొరేషన్ సంస్థ రూ.5.89 కోట్ల జీఎస్టీ ఎగవేతకు పాల్పడినట్లు వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి మంగళవారం వెల్లడించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఈ కంపెనీ లావాదేవీలపై అనుమానం కలిగిందని, గతేడాది డిసెంబర్ 24, 26 తేదీల్లో ఆ కంపెనీ సీఈవో పీయూష్ ప్రవీణ్ చంద్ర మెహతా నివాసంలో సోదాలు నిర్వహించామని వివరించారు. మే 2018 నుంచి అక్టోబర్ 2022 వరకు ఎంఎస్ పైపులు, టీఎంటీ బార్లు, టీఎంటీ రెబర్లు, సీఆర్ఎఫ్‌హెచ్ స్టీల్ కాయిల్స్ సరఫరా చేసినట్టు ఈ-వే బిల్లులు, ఇన్వాయిస్‌లు ఉన్నాయని, కానీ అందులో స్పష్టత లేదన్నారు. దీంతో ఆర్ఎఫ్ఐడీ(రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్) టెక్నాలజీ సహాయంతో పరిశీలించగా.. వస్తువుల ఇన్వాయిస్‌లు, ఈ-వే బిల్లుల ప్రకారం ఎక్కడా టోల్‌ప్లాజాలు, రింగ్‌రోడ్డులు దాటలేదని చెప్పారు. తప్పుడు వివరాలతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్(ఐటీసీ)ను క్లెయిమ్ చేసినట్టు గుర్తించామని తెలిపారు. వస్తువులను ఎగుమతి చేసుకోకపోయినా చేసుకున్నట్టు తప్పుడు ఐటీసీని క్లెయిమ్ చేశారన్నారు. సరుకు రవాణా కోసం వినియోగించే వాహనాల స్థానంలో కార్లు, ప్యాసింజర్ ఆటోలు, వ్యాన్లు, ద్విచక్ర వాహనాల నంబర్లతో తప్పుడు ఇన్వాయిస్‌లు సృష్టించారని తెలిపారు. ఈ క్రమంలో గతేడాది డిసెంబర్ 26న కంపెనీ సీఈవో పీయూష్‌పై వాణిజ్య పన్నుల శాఖ బేగంపేట డిప్యూటీ కమిషనర్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారని పేర్కొన్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న ఆయనను పోలీసులు అరెస్ట్ చేసినట్టు శ్రీదేవి తెలిపారు.

## బ్యాంకు డివిడెండ్లకు మార్గదర్శకాలు

### ఆర్బీఐ ముసాయిదా విడుదల




న్యూఢిల్లీ, జనవరి 2: బ్యాంక్‌లు వాటి షేర్‌హోల్డర్లకు డివిడెండ్లు ఇచ్చేందుకు అనుసరించాల్సిన మార్గదర్శకాల ముసాయిదాను రిజర్వ్‌బ్యాంక్ మంగళవారం విడుదల చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 2005నాటి మార్గదర్శకాలను సవరిస్తూ ఆర్బీఐ తాజాగా ముసాయిదాను రూపొందించింది. కొత్త నిబంధనల ప్రకారం డివిడెండు ఇచ్చే ఆర్థిక సంవత్సరంలో 6 శాతం లోపు నికర మొండి బకాయిలు (ఎన్‌పీఏ) ఉన్న బ్యాంక్‌లే డివిడెండ్లను ప్రకటించాలి. పాత మార్గదర్శకాల్లో నికర ఎన్‌పీఏ పరిమితి 7 శాతంగా ఉంది. డివిడెండు చెల్లింపు ప్రతిపాదనలను ఆమోదించేటపుడు బ్యాంక్ బోర్డులు అనుసరించాల్సిన ఆదేశాలను సైతం ఆర్బీఐ ముసాయిదాలో పొందుపర్చింది. ఎన్‌పీఏ వర్గీకరణ, మొండి బకాయిల కేటాయింపులు జరగాలని ఆదేశించింది. డివిడెండు ప్రకటించాలంటే వాణిజ్య బ్యాంక్‌కు క్యాపిటల్ అడిక్వసీ రేషియో (సీఏఆర్) కనీసం 11.5 శాతం ఉండాలని పేర్కొంది. అదే చిన్న ఫైనాన్స్ బ్యాంక్‌కు, పేమెంట్ బ్యాంక్‌కు 15 శాతం, లోకల్ ఏరియా బ్యాంక్‌లు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లకు 9 శాతం చొప్పున ఉండాలన్నది.

**చెల్లింపు పరిమితి పెంపు**

బ్యాంక్‌లు షేర్‌హోల్డర్లకు చెల్లించే డివిడెండ్ల పరిమితిని పెంచుతూ ముసాయిదాలో ఆర్బీఐ ప్రతిపాదించింది. నికర ఎన్‌పీఏ జీరో అయితే నికరలాభంలో 50 శాతం వరకూ డివిడెండ్‌గా చెల్లించవచ్చన్నది. గత మార్గదర్శకాల్లో ఈ పరిమితి 40 శాతం. తాత్కాలిక చెల్లింపు కోసం డివిడెండ్ ప్రకటిస్తామంటూ బ్యాంక్‌లు తమకు చేసే ఎటువంటి వినతినీ అంగీకరించబోమని ముసాయిదాలో ఆర్బీఐ స్పష్టం చేసింది.

## 72 వేల దిగువకు సెన్సెక్స్

### 379 పాయింట్లు నష్టపోయిన సూచీ

ముంబై, జనవరి 2: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు తిరోగమన బాట పట్టాయి. మదుపరులు ప్రాఫిట్ బుకింగ్‌కు మొగ్గుచూపడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను ఉపసంహరించుకోవడంతో సూచీలు భారీగా నష్టపోయాయి.



బ్యాంకింగ్, వాహన, ఐటీ రంగ షేర్లలో క్రయవిక్రయాలు జరగడం సూచీల ర్యాలీకి బ్రేక్‌పడింది. దీంతో మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 379.46 పాయింట్లు నష్టపోయి 72 వేల దిగువకు 71,892.48 పాయింట్లకు పడిపోయింది. ఒక దశలో 658 పాయింట్లు నష్టపోయిన సూచీ చివర్లో ఈ భారీ నష్టాలను తగ్గించుకోగలిగింది. మరోసూచీ నిఫ్టీ 76.10 పాయింట్లు కోల్పోయి 21,665.80 వద్ద ముగిసింది. ఇటీవల కాలంలో భారీగా పెరిగిన బ్యాంకింగ్, వాహన, ఐటీ రంగ షేర్లు కుదుపునకు లోనయ్యాయి. కానీ, ఫార్మా, ఎనర్జీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో భారీ నష్టాలను నియంత్రించగలిగాయి.

**మహీంద్రా టాప్ లూజర్**

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజాల్లో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా షేరు కుప్పకూలింది. మంగళవారం ట్రేడింగ్‌లో కంపెనీ షేరు ధర అత్యధికంగా 2.78 శాతం తగ్గి టాప్ లూజర్‌గా నిలిచింది. అల్ట్రాటెక్ సిమెంట్ 2.46 శాతం కోల్పోగా, కొటక్ బ్యాంక్ 2.41 శాతం, లార్సెన్ అండ్ టుబ్రో 2.36 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, విప్రో, హెచ్‌యూఎల్ షేర్లు నష్టపోయాయి. కానీ, సన్ ఫార్మా, బజాజ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, టైటాన్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే క్యాపిటల్ గూడ్స్ 1.42 శాతం, ఆటో 1.32 శాతం, బ్యాంకింగ్ 1.16 శాతం, రియల్టీ 1.04 శాతం, ఐటీ 1.03 శాతం, టెక్ షేర్లు పతనమవగా..ఎనర్జీ, హెల్త్‌కేర్, సేవలు, మెటల్ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

## డీ-మార్ట్ ఆదాయం 13,247 కోట్లు

న్యూఢిల్లీ, జనవరి 2: డీ-మార్ట్ పేరుతో రిటైల్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ ఆశాజనక పనితీరు కనబరిచింది. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికిగాను సంస్థ రూ.13,247.33 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,304.58 కోట్ల ఆదాయంతో పోలిస్తే 17.18 శాతం పెరిగింది. ప్రస్తుతం సంస్థకు తెలంగాణతోపాటు మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, రాజస్థాన్ రాష్ర్టాల్లో 341 స్టోర్లను నిర్వహిస్తున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.